## క్లుప్తంగా

### నేడు డయాలసిస్ సెంటర్ ప్రారంభం

**చేవెళ్ల:** చేవెళ్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలిసిస్ సెంటర్ ప్రారంభానికి సోమవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి వస్తున్నారని చేవెళ్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభోత్సవం కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమం ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, అధికారులు అందరు హాజరు కావాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**మొయినాబాద్:** మొయినాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ ఏఈ హనుమనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మొయినాబాద్‌లోని శివానగర్, చిలుకూరు, దేవల్‌వెంకటాపూర్(బాలాజీ టెంపుల్) ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించగలరని ఆయన కోరారు.

### క్రీడాకారులకు దుస్తులు పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న రాజేష్‌పటేల్

**కొందుర్గు:** సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు కొందుర్గు వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు పట్టుదలతో పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలన్నారు. మండలాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడాకారులను నాయకులు దామోదర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణా అభినందించారు.అలాగే, జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో సోమవారం హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులను టీఆర్ఎస్ నాయకులు కృష్ణ అభినందించారు. అనంతరం క్రీడాకారులకు యూనిఫామ్స్, పీఈటీలకు ట్రాక్ షీట్‌లు అందజేశారు.

### ఆలయాల అభివృద్ధికి కృషి



పూజలు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్

**శంకర్‌పల్లి:** దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బీజేపీ సీనియర్ నాయకుడు వగ్రి తులసీరాం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని మిర్జాగూడ అనుబంధ గ్రామమైన మియాఖాన్‌గడ్డలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పురాతన దేవాలయాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రవీందర్ గౌడ్, ఉప సర్పంచ్ శాంతికిషన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్, రాయదుర్గం పీఏసీఎస్ చైర్మన్ అరవింద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### 2న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

**మీర్‌పేట:** రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జూన్ 2న నిర్వహించే ఈ క్విజ్ పోటీలకు సంబంధించి పోస్టర్లను ఆదివారం మీర్‌పేట మంద మల్లమ్మ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా ఇన్‌చార్జి నయీం సద్దాం ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. క్విజ్ పోటీల్లో పాల్గొనేందుకు 16 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు 766 189 9899 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింక్ వస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమ అంశాలపై 60 ప్రశ్నలకు 60 నిమిషాల నిడివి ఉంటుందన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్, ట్యాబ్‌లను అందజేస్తామన్నారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 40 మందికి ప్రోత్సాహక బహుమతి కింద స్మార్ట్ వాచ్‌లు, ఇయర్‌ప్యాడ్‌లు, హార్డ్‌డ్రైవ్‌లు, పవర్ బ్యాంక్‌లను ఇస్తామన్నారు. ప్రతీ అసెంబ్లీ పరిధిలో ఒక మహిళకు ఎలక్ట్రిక్ స్కూటీని బహుమతిగా అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పెండెం రాజు, రంజిత్, అమీర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల అధ్యక్షులు దీక్షిత్, నందకిషోర్, కౌశిక్, సాహెల్ పాల్గొన్నారు.

# ఎందుకంత నిరాసక్తత!

- పరిశ్రమలున్నా.. ఉపాధి కల్పన సున్నా..
- ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు స్థానికులు
- పట్టించుకోని పాలకులు



ఉపాధి కోసం ఓ పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న యువత (ఫైల్)

**కొత్తూరు:** కొత్తూరు మండలం పేరు వింటేనే ఆయా ప్రాంతాలకు చెందిన వారు ఎంతో అభివృద్ధి చెందిన మండలంగా పేర్కొంటారు. వాస్తవంగా మండలంలో అభివృద్ధి పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది. ఇక్కడ పరిశ్రమలు ఉన్నప్పటికీ స్థానికులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే దుస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో పాలకులు ఇస్తున్న హామీలు కాగితాలు, ప్రసంగాల వరకే పరిమితమవుతున్నాయే తప్ప వాస్తవరూపం దాల్చడం లేదు.

**ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు..**

మండలంలో పరిశ్రమలు ఉన్నప్పటికీ స్థానికులకు ఉపాధి కల్పించడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. కొందరికి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఏదో ఒక సాకుతో నిర్వాహకులు ఉపాధి ఇవ్వడం లేదు.. దీంతో స్థానికులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయా పార్టీలకు చెందిన నాయకులు ఉపాధి కల్పిస్తామని చెబుతున్నా హామీలు వాస్తవరూపం దాల్చడం లేదు. ఉపాధి కల్పించడానికి కనీసం వృత్తి విద్యా కేంద్రాలను సైతం ప్రారంభించడం లేదు. పలు పరిశ్రమలు వెదజల్లే కాలుష్యంతో ఇప్పటికే ఎంతో మంది మృత్యువాత పడ్డారు. మరికొంత మంది అనారోగ్యాల బారిన పడి మంచాలకే పరిమితమయ్యారు. అయినప్పటికీ కాలుష్యం వెదజల్లే పరిశ్రమలపై అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

**వృత్తి విద్యాకేంద్రాలను ప్రారంభించాలి**



మండలంలోని ఆయా పరిశ్రమల నిర్వాహకులు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ సరైన నైపుణ్యం, అనుభవం లేదనే సాకుతో స్థానికులకు ఉపాధి కల్పించడానికి నిరాసక్తత కనబర్చుతున్నారు. కొన్ని పరిశ్రమల యాజమాన్యాలు అరకొరగా ఉపాధి కల్పిస్తున్నారు.

– కర్రోళ్ల సురేందర్, కొత్తూరు

**చట్ట ప్రకారం కల్పించాలి**



స్థానికంగా పరిశ్రమలను ఏర్పాటు చేసే నిర్వాహకులు చట్ట ప్రకారం సమీపంలోని గ్రామాలు, మండలాల ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. అనుభవం, నైపుణ్యాల ఆధారంగా యువత, నిరుద్యోగులకు పని కల్పించాలి.

– పర్వతాలు, ఏఐటీయూసీ, జిల్లా అధ్యక్షుడు

# ప్రమాదకర గుంతకు రక్షణ కంచె

**నందిగామ:** మండలంలోని అంతిరెడ్డిగూడకు అతి సమీపంలో నూతనంగా వెలసిన ఓ వెంచర్‌లో ప్రమాదకరంగా ఉన్న గుంతకు సంబంధించి 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన ఈ నెల 4న సాక్షిలో ప్రచురితమైన కథనానికి వెంచర్ నిర్వాహకులు గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా నీటితో నిండి ఉన్న గుంతకు రక్షణ కవచంగా గ్రీన్ మ్యాట్‌ను ఏర్పాటు చేశారు. గ్రామానికి ఆనుకొని ఉన్న ఈ వెంచర్‌లో చిన్న పిల్లలు ఆటలు ఆడుకుంటుంటారు. ఈ గుంత ఇలాగే ఉన్నట్లయితే ప్రమాదం జరుగుతుందని రక్షణ కంచె ఏర్పాటు చేశారు.. కథనానికి స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..



సాక్షిలో కథనం రాక ముందు ఇలా..



కథనం వచ్చిన తర్వాత ఇలా..

### చిలకమర్రికి బస్సు సౌకర్యం

**షాద్‌నగర్:** మండలంలోని చిలకమర్రి గ్రామస్తులు ఎన్నో ఏళ్లుగా బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీశైలం, ఉప సర్పంచ్ సత్యం, మాజీ సర్పంచ్ ఆనంద్‌లు షాద్‌నగర్ నుంచి చిలకమర్రికి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామస్తులు ఎంతో కాలంగా బస్సు కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సహకారంతో వారి కల నెరవేరిందన్నారు. బస్సు సౌకర్యంతో గ్రామస్తులకు, విద్యార్థులకు, రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నరేష్, రవి, సుశీల పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న నాయకులు

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపేట



ఆగ్రోమార్ట్‌ను ప్రారంభించిన ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే

**శంకర్‌పల్లి:** రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట చేస్తోందని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలో రైతు ఆగ్రోమార్ట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని అన్నారు. ప్రతి మండల కేంద్రాల్లో రైతు ఆగ్రోమార్ట్‌ల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులను, విత్తనాలను అందించడం జరుగుతుందన్నారు. ఆగ్రో మార్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆగ్రో కేంద్రాల్లో ప్రభుత్వం తరఫున వచ్చే సబ్సిడీలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, మండల వ్యవసాయాధికారి సురేష్ బాబు, పర్వేద ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీనాథ్‌గౌడ్, ముకుందం, ఉపేందర్, సంజీవరెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**



షాద్‌నగర్: కాలనీల్లోని సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఇతర నాయకులు

**షాద్‌నగర్:** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 20, 21 వార్డుల్లో ఎమ్మెల్యే బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డు పరిధిలోని కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. షాద్‌నగర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు బస్తీబాట కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు కావాల్సిన కనీస సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తద్వారా పట్టణం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నట్‌రాజన్, మాజీ చైర్మన్ విశ్వం ,సరిత, యాదగిరి, జీటీ శ్రీనివాస్, రవియాదవ్, రఘునాథ్ యాదవ్, శంకర్, భిక్షపతి, నరేష్, నర్సింలు యాదవ్, జంగరాజ్, సంతోష్, అశోక్ యాదవ్, ఖాజా, వెంకటేష్ యాదవ్, మహేష్ యాదవ్, మహేందర్ పాల్గొన్నారు.

**నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి**

**కొందుర్గు:** రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ద్వారా కొందుర్గు మండల కేంద్రంలో మంజూరైన ఎరువులు, విత్తనాల దుకాణాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలకు విధిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం అందించే రాయితీలు రైతులకు అందేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి**

**షాద్‌నగర్:** గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం బూర్గులలో పార్టీ నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలని సూచించారు. గ్రామకమిటీ అధ్యక్షుడిగా కుమ్మరి నర్సింలు, ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్య, జంగయ్య, సంజయ్య, రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అంజయ్య, సహాయ కార్యదర్శులుగా రంగయ్య, వెంకటయ్య, శ్రీను, కోశాధికారిగా మల్లేష్‌గౌడ్, రాములు, సభ్యులుగా సాధిక్, సహదేవ్, రాములు, భగవాన్, యాదయ్య, కృష్ణయ్యలను ఎన్నుకున్నారు. అదేవిధంగా యూత్ కమిటీ అధ్యక్షుడిగా రాజేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా శివకుమార్, శ్రీనివాస్ యాదవ్, శివ, అఖిల్, ప్రధాన కార్యదర్శిగా రామ్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

### ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

**ఆమనగల్లు:** మండల పరిధిలోని పోలెపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు రెండు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం పోచమ్మ దేవతను వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపనోత్సవాలకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, సర్పంచ్ బాలరాం, ఎంపీటీసీ సభ్యుడు కుమార్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, అంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును నిర్మించాల్సిందే

- నేడు షాద్‌నగర్ మహాధర్నాకు వైఎస్ షర్మిల రాక
- వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం



**షాద్‌నగర్:** పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించ తలపెట్టిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మహ్మద్ ఇబ్రహీం డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రిజర్వాయ ర్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ షాద్‌నగర్ పట్టణంలో సోమవారం ప్రతిపక్ష, ప్రజా సంఘాల ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమానికి వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విచ్చేస్తున్నట్లు తెలిపారు. పాలమూరు ఎత్తిపోతల పథకం స్వర్గీయ డాక్టర్ వైఎస్ హయాంలో పురుడుపోసుకుందన్నారు. గత ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ కుర్చీ వేసుకొని కుర్చోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును నిర్మిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయితే షా ద్‌నగర్ సస్యశ్యామలం అవుతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం పలుమార్లు ప్రాజెక్టు డిజైన్‌లను మార్చిందని, ప్రాజెక్టు నిర్మించకుండా ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. ప్రాజెక్టు పనులు ప్రారంభించేదాకా రైతులు, ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. మహాధర్నా లో రైతులు, మేధావులు, విద్యావేత్తలు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

**కాంగ్రెస్ నేత వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్ :** దేశ ప్రధానిగా రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ నేత వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ.. అణురంగంలో దేశాన్ని అభివృద్ధి చేసిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని అన్నారు. టెక్నాలజీ రంగంలో భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలపాలని కలలుగని ఆ దిశగా కార్యాచరణ రూపొందించి అమలు చేసిన మహానేత రాజీవ్‌గాంధీదేనని కొనియాడారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం రాజీవ్‌గాంధీ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టారని , రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. దేశాభివృద్ధికి పాటుపడి ప్రజా సంక్షేమాన్ని చేపట్టిన మహానేత గురించి ప్రస్తుతం అధికార పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాభివృద్ధికి రాజీవ్‌గాంధీ వేసిన పునాది ప్రస్తుతం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. రాజీవ్‌గాంధీ ఆశయాల సాధన కోసం అందరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, నర్సింహ్మారెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్ యాదవ్, పురుషోత్తంరెడ్డి, చెన్నయ్య, సిద్దార్థ, నెహ్రూనాయక్, పెంటయ్య పాల్గొన్నారు.



షాద్‌నగర్ : రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**స్ఫూర్తి ప్రదాతకు ఘన నివాళి**

**చేవెళ్ల:** దివంగత నేత భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం సీనియర్ నాయకుడు సున్నపు వసంతం, టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్‌లు పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ప్రజలకు చేసిన సేవలు మరువలేని అన్నారు. పంచాయతీ రాజ్ సంస్థలను బలోపేతం చేయడానికి కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు నిధులను నేరుగా పంపించే వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రాములు, మాజీ ఎంపీటీసీ పెంటయ్య, నాయకులు మాణిక్యం, శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరువలేనివి**

**మొయినాబాద్ రూరల్:** స్థానిక సంస్థల బలోపేతానికి కృషి చేయడంతో పాటు దేశంలో ఐటీ రంగం విస్తరణకు స్వర్గీయ రాజీవ్‌గాంధీ ఎంతో కృషి చేశారని రాష్ట్ర ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలల చైర్మన్ గౌరీ సతీష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పురాణం వీరభద్రస్వామిలు పేర్కొన్నారు. ఆదివారం రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని హిమాయత్‌నగర్ చౌరస్తాలో పార్టీ అధ్యక్షుడు మాణయ్య ఆధ్వర్యంలో ఆయనకు నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు మరవలేనివన్నారు. గ్రామాల్లో నేటికి ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమం మరచిపోలేనివని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు రాజు, రమేష్, హిమాయత్ నగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహా, నాయకులు రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ, గణేశ్‌గౌడ్, రమేష్, అనంతరెడ్డి, రవీందర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, విజయేందర్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల : రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ అర్పిస్తున్న నాయకులు

# నిరుపేద కుటుంబానికి అండగా కడెంపల్లి

**సొంత ఖర్చులతో ఇంటి నిర్మాణానికి భూమిపూజ**

**షాద్‌నగర్‌రూరల్:** నిరుపేదల అభివృద్ధి , సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని టీపీసీసీ సభ్యుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్టకు చెందిన సీమ ప్రేమిల దీనపరిస్థితిని చూసిన కడెంపల్లి వారికి కుటుంబానికి అండగా నిలిచారు. ఆదివారం ఆయన సొంత ఖర్చులతో ప్రేమిల ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కడెంపల్లి మాట్లాడుతూ.. పేదోడికి కూడు, గూడు, గుడ్డ నినాదంతో దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసం ఎనలేని కృషి చేశారని అన్నారు. అదే స్ఫూర్తితోనే ముందుకు సాగుతున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను తీసుకురావడం జరిగిందని చెప్పారు. కానీ, ప్రస్తుత పాలకులు పేదల కష్టాలను మరిచి స్వార్థ ప్రయోజనాల కోసం పని చేస్తున్నారని వాపోయారు. గ్రామంలో హాత్‌సే హాత్ జోడో కార్యక్రమం చేపట్టిన సమయంలో ప్రేమిల కుటుంబ పరిస్థితి చూసి ఇంటి నిర్మాణానికి హామీ ఇవ్వడం జరిగిందన్నారు. తనవంతు సహాయం చేయాలనే ఇంటి నిర్మాణానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పెంటారెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, వార్డు సభ్యులు విజయలక్ష్మి, శ్రీపాద రెడ్డి, నాయకులు దినేష్‌సాగర్, మధు, సుధీర్, బాస్కర్‌గౌడ్, పరమేశ్వర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, దినేష్‌రెడ్డి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న కడెంపల్లి, తదితరులు

# మహాధర్నాను విజయవంతం చేద్దాం

**కొందుర్గు:** లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం షాద్‌నగర్‌లో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజల నీటి కష్టాలు తీరుతాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగునీరు, తాగునీరు లభిస్తుందని, ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని తెలిపారు. ఈ ధర్నాకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదయ్య, మల్లయ్య, రవి, రామస్వామి, అజీమ్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు